వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి



మోతీనగర్: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని శ్రీ శృంగేరి శారద శంకరమఠం మోతీనగర్ శాఖ ధర్మాధికారి సీఎస్ఆర్ మూర్తి సూచించారు. స్వర్ణభారతి మహోత్సవంలో భాగంగా సాధూరాం కంటి ఆసుపత్రి, శ్రీ శృంగేరి శారద శంకరమఠం, సేవా భారతి చారిటబుల్ ట్రస్ట్, సాయిప్రసాద్ సేవా ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో మఠం ఆవరణలో సోమవారం ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కంటి పరీక్షలు చేసి అవసరమున్న వారికి కళ్లద్దాలు అందజేశారు. అలాగే క్యాటరాక్ట్ ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు మాట్లాడుతూ సువర్ణ భారతి మహోత్సవంలో భాగంగా ఉచిత వైద్య శిబిరాలతో పాటు వస్త్రదానం, అన్నదానంతో పాటు విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో బ్రహ్మానందరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీ



డ్రోన్‌తో దోమల నివారణ మందు పిచికారీ చేయిస్తున్న కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని ఎల్లమ్మ చెరువు పరిసర ప్రాంతాల ప్రజలు దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి ఎంటమాలజీ సిబ్బందితో కలిసి సోమవారం డ్రోన్ యంత్రం సహాయంతో దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు కూడా బాధ్యతగా తమ ఇంటి పరిసరాలు, చెరువులు, కుంటల వద్ద చెత్తాచెదారం వేయకుండా, ఉదయం ఇళ్ల వద్దకు వచ్చే పారిశుధ్య ఆటో సిబ్బందికి అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి శివరాజ్‌గౌడ్, వెంకటరెడ్డి, రాజు గౌడ్, నరసింహులు, ఎంటమాలజీ సూపర్‌వైజర్ డీ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆగని దందా..!

- పుర నిర్మాణాల్లో.. అక్రమాల పరంపర
- పట్టించుకోని కమిషనర్లు.. అడ్డగోలుగా అనుమతులు



సాక్షి, సిటీబ్యూరో: అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు ప్రభుత్వం పురపాలికల సంఘాల్లో టీఎస్‌–బీపాస్ విధానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ సంబంధిత అధికారుల అలసత్వం, పలువురి సిబ్బంది చేతివాటంతో అక్రమాలకు అడ్డుకట్ట పడటం లేదు. ఇంటి నిర్మాణాలు, స్థలాల మార్పిడి కోసం ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించకుండానే అధికారులు అనుమతులు ఇచ్చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఏడు పురపాలక సంఘాల్లో ఇటీవల విలీనమైన 28 పంచాయతీల్లో మాత్రం నిర్మాణాలు, బహుళ అంతస్తుల భవనాలు, వ్యాపార వాణిజ్య సదుపాయాలకు సంబంధించిన కట్టడాల్లో అక్రమాలు కోకొల్లలుగా చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ఆస్తిపన్ను అసిస్‌మెంట్ లెక్కింపులో కూడా తప్పిదాలు జరుగుతున్నాయంటున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని 13 పురపాలిక సంఘాల్లో జనవరి నుంచి ఇప్పటి వరకు 4,947 దరఖాస్తులు కాగా, 34 గ్రామ పంచాయతీల పరిధిలో 1,406 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది.

నిబంధనలకు తూట్లు..

గతంలో నిబంధనలకు విరుద్ధంగా ఉంటే దరఖాస్తులను అధికారులు తిరస్కరించేవారు. బీపాస్ ద్వారా అన్ని దరఖాస్తులు సులువుగా పరిష్కారమవుతుండటంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసిస్‌మెంట్ లెక్కింపులో కొందరు అధికారులు, బిల్డర్లు కొంత వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిబంధనలు పాటించని ఇళ్లకు కొందరు పర్యవేక్షణాధికారులు ఆమోదం తెలుపుతున్నారన్న విమర్శలు ఉన్నాయి. భారీ భవనాలు, వాణిజ్య సముదాయాలకు కొలతలు తక్కువ చేసి అనుమతులు మంజూరు చేస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. పారదర్శకత కోసం ప్రభుత్వం బీపాస్ తెచ్చినా తెరచాటు అవినీతికి కళ్లెం పడలేకపోతోందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో ప్రధానంగా పీర్జాదిగూడ, బోడుప్పల్, నిజాంపేట, కొంపెల్లి, దుండిగల్, దమ్మాయిగూడ, నాగారం, తూముకుంట, మేడ్చల్, జవహర్‌నగర్ పురపాలక సంఘాల్లో ఇష్టానుసారంగా అక్రమణల పరంపర కొనసాగుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోకపోవటంతో టౌన్ ప్లానింగ్‌లోని పలువురు ఉద్యోగులు, సిబ్బంది దోచుకుంటున్నారన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

పలువురు ప్రతినిధులు, సిబ్బంది పాత్ర..

పురపాలికల్లో ప్రణాళిక, రెవెన్యూ విభాగాల్లో పెద్ద ఎత్తున తప్పిదాలు దొర్లుతున్నాయి. బీపాస్ అమల్లోకి వచ్చాక అవినీతి తగ్గుతుందనుకుంటే.. అక్రమాలు పెరుగుతున్నాయి. 75 నుంచి 120 గజాల్లోపు ఇళ్ల పత్రాలన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించాలి. ఈ వ్యవహారాన్ని పట్టణ ప్రణాళిక విభాగం పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఇంటి కొలతల ఆధారంగా అసిస్‌మెంట్ లెక్కింపునకు యజమానులు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం సెట్‌బ్యాక్ వదలాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో యజమానులు అవేమీ పట్టించుకోకుండా ఇష్టానుసారంగా నిర్మాణాలు చేపడుతున్నారు.

అతిక్రమిస్తే...

పురపాలికల్లో అసిస్‌మెంట్ లెక్కింపులో తప్పిదాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు. బీపాస్ దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలని పట్టణ ప్రణాళిక అధికారులకు సూచిస్తున్నామంటున్నారు. అన్నీ సక్రమంగా ఉంటేనే అనుమతులు మంజూరు చేస్తున్నామని పేర్కొంటున్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పురపాలక చట్టం ప్రకారం సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామంటున్నారు.

పాఠశాలల్లో అదనపు గదులకు స్థలం కేటాయించాలి



జిల్లా అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న సతీశ్ తదితరులు

నిజాంపేట్: ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరుతూ నిజాంపేట్ బీజేపీ మాజీ అధ్యక్షుడు ఆకుల సతీశ్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా అడిషనల్ కలెక్టర్ విజేందర్‌రెడ్డికి సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాచుపల్లి జడ్పీహెచ్‌ఎస్‌లో సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై గతంలోనూ వినతి పత్రం అందజేశామన్నారు. ఎకరం స్థలం కేటాయిస్తే చెన్నైకు చెందిన విర్‌ట్యూస్ సాఫ్ట్‌వేర్ కంపెనీ సీఎస్ఆర్ నిధుల కింద 16 గదులు నిర్మించి మౌలిక వసతులు కల్పించేందుకు ముందుకు వచ్చిందన్నారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి 2 వేల గజాల స్థలాన్ని కేటాయించాలని కోరగా అడిషనల్ కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. సంబంధిత రెవెన్యూ అధికారులకు స్థలం కేటాయించేలా ఆదేశాలు జారీ చేస్తామని పేర్కొన్నట్లు సతీశ్ తెలిపారు. ఆయన వెంట అరుణ్ రావు, ఈశ్వర్‌రెడ్డి, చందు, రవి, రాజు ఉన్నారు.

ఫస్ట్‌ఎయిడ్ సేవలకు మాత్రమే పరిమితం కావాలి



సాక్షి,సిటీబ్యూరో: ఫస్ట్ ఎయిడ్ సెంటర్ సేవలకు మాత్రమే తమ క్లినిక్‌లను ఆర్‌ఎంపీలు వినియోగించుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. రఘునాథ్‌స్వామి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయం హాలులో జిల్లా గ్రామీణ వైద్య ప్రాక్టీషనర్లతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. యాంటీబయోటిక్ ఇంజెక్షన్లు, స్టెరాయిడ్లు, నొప్పి నివారణ వంటి మందులు ఇచ్చే అనుమతి లేదని స్పష్టం చేశారు. తమ క్లినిక్‌లను 'ఫస్ట్ ఎయిడ్ క్లినిక్స్' అనే బోర్డులతో అమర్చాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన నకిలీ వైద్యులుపై క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జాతీయ వైద్య కమిషన్, తెలంగాణ మెడికల్ కౌన్సిల్ నిర్వహించే తనిఖీల్లో పూర్తి సహకారం అందించాలని ఆదేశించారు. నిబంధనలు పాటించకపోతే క్లినిక్స్ మూసివేత చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడితే.. జిల్లా ఆరోగ్య వైద్య, కుటుంబ సంక్షేమశాఖ ఉపేక్షించబోదన్నారు. ఆర్‌ఎంపీలపై అవసరమైతే చట్ట రీత్యా కేసు నమోదు చేసి కఠినంగా శిక్ష పడేలా చూస్తామని హెచ్చరించారు.

ప్రజా ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలి



సాక్షి,సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించిన ఫిర్యాదులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాల జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) హరిప్రియ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి 76 ఫిర్యాదులు స్వీకరించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని పేర్కొన్నారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి, పరిష్కరించాలన్నారు. ఇందులో జిల్లా లా–ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా సోనియాగాంధీ జన్మదిన వేడుకలు



హస్మత్‌పేట చౌరస్తాలో వేడుకల్లో మైనంపల్లి హన్మంత్‌రావు, హరివర్ధన్‌రెడ్డి, బండి రమేశ్, దండుగుల యాదగిరి

కూకట్‌పల్లి (జోన్ బృందం): కూకట్‌పల్లి జంట సర్కిళ్ల పరిధిలో కాంగ్రెస్ అధి నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేశారు. అలాగే పలుచోట్ల సేవా కార్యక్రమాలు చేపట్టారు. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యను పరిష్కరించండి

రంగారెడ్డినగర్: సుభాష్‌నగర్ డివిజన్ సూరారంలోని రామ్‌లీలా మైదానం వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు కుత్బుల్లాపూర్ జలమండలి జీఎం అశోక్‌ను సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ల క్రితం వేసిన పైపులైన్ సామర్థ్యం సరిపోవడం లేదని, దీంతో తరచూ రోడ్లపై మురుగు పారడంతో స్థానికులతో పాటు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై జీఎం స్పందించి అధికారులతో పర్యటించి నూతన పైపులైన్ వేసేందుకు ప్రణాళికలు రూపొందించేలా చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు.

బీఆర్‌ఎస్ కార్యాలయ ప్రారంభానికి తరలిన శ్రేణులు



వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి రంగారావు



ఆల్విన్‌కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ నుంచి ఎర్రబెల్లి సతీశ్‌రావు

కూకట్‌పల్లి(జోన్‌బృందం): దుండిగల్‌లో నిర్మించిన మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ కార్యాలయ ప్రారంభోత్సవం, ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బహిరంగ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆదేశాల మేరకు బీఆర్‌ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లు వెళ్లిన వారిలో ఉన్నారు.

రాష్ట్ర ఉత్తమ వైద్యాధికారి శ్రీదేవికి ఘన సత్కారం



సాక్షి,సిటీబ్యూరో: రాష్ట్ర టీబీ శిక్షణ, ప్రదర్శన కేంద్రం నిర్వహించిన కార్యక్రమంలో ఉత్తమ కార్యక్రమాధికారిగా పురస్కారాన్ని అందుకున్న డాక్టర్ శ్రీదేవిని జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్. రఘునాథ్‌స్వామి అభినందించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఆయన ఘనంగా సన్మానించారు. డాక్టర్ శ్రీదేవి అందుకున్న పురస్కారం జిల్లా ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ విభాగానికి గర్వకారణమని తెలిపారు. మేడ్చల్ జిల్లా వైద్యవిభాగానికి సంబంధించి అన్నీ అంశాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. వైద్యాధికారులు, సిబ్బంది ఇలాంటి పురస్కారాలను తీసుకురావడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు, వైద్యాధికారులు పద్మావతి, సరస్వతి, చంద్రకళ, మంజులా రెడ్డి తదితరులు పురస్కార గ్రహీత డాక్టర్ శ్రీదేవిని అభినందించారు.

ప్రజాపాలన విజయోత్సవం

మోతీనగర్: అల్లాపూర్ డివిజన్ పర్వత్‌నగర్‌లో డివిజన్ అధ్యక్షుడు మొయినుద్దీన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన విజయోత్సవాల కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కాల్వ సుజాత గుప్తా, నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేశ్, టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం సోమవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి సోనియాగాంధీకి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు, బ్లాక్ అధ్యక్షులు, మహిళా నాయకురాళ్లు, డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 10న (నేడు) భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పీఎఫ్ కమిషనర్ డాక్టర్ హేమంత్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్టీసీ బస్ టెర్మినల్‌లోని రెండో అంతస్తులోని పీఎఫ్ కార్యాలయంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవడమే కాకుండా, సలహాలు, సూచనలు స్వీకరిస్తామని తెలిపారు.

పాత కక్షలతో ఒకరిపై దాడి

కుత్బుల్లాపూర్: పాత కక్షల నేపథ్యంలో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాలపోగు ప్రేమ్, జాషువా అలియాస్ బన్నీల మధ్య పాత గొడవలు ఉన్నాయి. ప్రేమ్ తన స్నేహితులతో కలిసి ఆదివారం మద్యం సేవిస్తుండగా జాషువా అతనితో గొడవ పడ్డాడు. అదేరోజు అర్ధరాత్రి ప్రేమ్ తన స్నేహితులతో కలిసి ఇంటికి వెళ్తుండగా జాషువా ప్రేమ్‌పై కత్తితో దాడి చేయగా కడుపు, కుడి చేతికి గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని చికిత్స కోసం స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


సమస్యలు ఎరిష్కరించాలని డీసీకి వినతి



డీసీకి వినతిపత్రం అందజేస్తున్న కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, బీజేపీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్‌కాలనీ, వివేకానందనగర్ డివిజన్లలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బీజేపీ నాయకులు మూసాపేట జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిని మరిచి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. బీజేపీ కార్యవర్గ సభ్యుడు సురభి రవీందర్‌రావు దాదాపు అన్ని కాలనీలు, బస్తీల్లో, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ చాలావరకు దెబ్బ తిన్నాయని, కొన్ని ప్రదేశాల్లో వీధీలైట్లు కూడా లేవని, పరిసరాలు సరిగ్గా శుభ్రం చేయక పోవడంతో దోమలు విజృంభించి ప్రజలు, చిన్నారులు అనారోగ్య పాలవుతున్నారన్నారు. డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. కార్యక్రమంలో మణిభూషణ్, రామరాజు, నరేందర్ రెడ్డి, కుమార్‌యాదవ్, వెంకటస్వామి రెడ్డి, అరుణ్ కుమార్, గోపాల్‌రావు, బాలు యాదవ్, రాజిరెడ్డి, కృష్ణంరాజు, ఎత్రి రమేశ్‌రాయల్, రామ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై మహాసభల్లో తీర్మానాలు



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

నిజాంపేట్: స్థానిక సమస్యల పరిష్కారానికి పెద్ద పీఠ వేస్తూ సీపీఎం మహాసభల్లో తీర్మానాలు చేశామని మేడ్చల్ జిల్లా నూతన కార్యదర్శి పీ సత్యం అన్నారు. ప్రగతినగర్‌లోని సుందరయ్య భవన్‌లో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రగతినగర్ అంబీర్ చెరువు కాలుష్య నివారణకు, జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌ను విభజించి నగరంలోని నాలుగు దిక్కులా ఏర్పాటు చేయాలన్నారు. గ్రేటర్‌లో ఉచిత నీటి పథకాన్ని మున్సిపల్ ప్రాంతాలకు కూడా వర్తింపజేయాలని, కార్మికులకు కనీస వేతనాలు రూ.26 అందించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ఆశా వర్కర్లపై అధికారుల వేధింపులు ఆపాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రోశేఖర్, శ్రీనివాసులు, మండల కార్యదర్శి వెంకటరామయ్య తదితరులు పాల్గొన్నారు.

బాచుపల్లి మండల నూతన కార్యవర్గం

బాచుపల్లి మండల నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యదర్శిగా రవి, సభ్యులుగా చంద్రశేఖర్, అశోక్, వినోద, రాజశేఖర్, శ్రీనివాసులు ఎన్నికయ్యారు.

బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్

కేటీఆర్ సభ సక్సెస్‌తో ఉత్సాహంలో నాయకులు, కార్యకర్తలు



ర్యాలీగా వస్తున్న కేటీఆర్, శంభీపూర్ రాజు, వివేకానంద్




సభకు హాజరైన బీఆర్‌ఎస్ శ్రేణులు


దుండిగల్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ కుత్బుల్లాపూర్ పర్యటన మేడ్చల్ జిల్లా బీఆర్‌ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. గండిమైసమ్మలోని జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవానికి ఆయనతో పాటు మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నేతలు హాజరయ్యారు. దీంతో అక్కడ సందడి వాతావరణం నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు సంధిస్తు.. చలోక్తులు విసురుతూ నాయకులు, కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో పాటు ముఖ్య నేతలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సభ సక్సెస్ కావడంతో నాయకులు, కార్యకర్తలు ఉత్సాహంగా కనిపించారు.

సైడ్ లైట్స్..

- 5 గంటలకు సభ ప్రారంభం కావాల్సి ఉండగా గంట ఆలస్యం అయ్యింది.
- ప్రచార వాహనంలో ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌తో కలిసి కేటీఆర్ ర్యాలీగా వచ్చారు. దుండిగల్ మున్సిపల్ చైర్ పర్సన్ కృష్ణవేణి తిలకం పెట్టి ఆహ్వానం పలికారు.
- కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించి పాలాభిషేకం చేశారు. నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు.
- రసమయి బాలకిషన్, దేశపతి శ్రీనివాస్‌తో పాటు కళాకారుల బృందం పాటలు ఆలపిస్తు సభికులను ఉత్సాహ పరిచారు.
- కేటీఆర్‌తో ఫొటోలు దిగేందుకు నాయకులు, కార్యకర్తలు పోటీ పడ్డారు.
- మాజీ మంత్రి మల్లారెడ్డి కళాకారులతో కలిసి స్టెప్పులు వేశారు.
- కేటీఆర్ వస్తున్న దారి పొడవునా శంభీపూర్ రాజు, వివేకానంద్ భారీగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేశారు.
- తెలంగాణ తల్లి వేషధారణలో ఇద్దరు చిన్నారులు ఆకట్టుకున్నారు.
- మేడ్చల్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు కేటీఆర్‌ను ఘనంగా సన్మానించారు.
- 20 నిమిషాల్లో కేటీఆర్ తన ప్రసంగాన్ని ముగించారు.
- కార్యాలయ ప్రారంభోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యే వివేకానంద్‌ను కేటీఆర్ ప్రత్యేకంగా అభినందించారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కేటీఆర్



కేటీఆర్‌ను సన్మానిస్తున్న మేడ్చల్ జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912225462
9705444132